
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 2 జూన్ 2024





జై హనుమాన్

జిల్లా అంతటా హనుమాన్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి విశేష అలంకారాలు, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. తమలపాకులతో, మామిడి పండ్లతో సహస్ర నామార్చనలు నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. భక్తులు శ్రీఆంజనేయం నామస్మరణ చేశారు. సువర్చలా సహిత వీరాంజనేయస్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం అందించగా కొన్ని ప్రధాన దేవాలయాల్లో అన్న ప్రసాద వితరణలు జరిగాయి.

కర్లపాలెం: పాతనందాయపాలెంలో శ్రీఅభయాంజనేయస్వామికి గజమాల, నిమ్మకాయలతో అలంకరణ



విశేషాలంకరణలో జంపని వీరాంజనేయ స్వామి

కందిపప్పు కోత

- ఐదు నెలలుగా కార్డుదారులకు ఎగవేత
- బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180
- రాయితీపై పంపిణీని విస్మరించిన పౌరసరఫరాల శాఖ
- నిత్యావసరాల ధరలు పెరిగినా పట్టించుకోని ప్రభుత్వం
- రేషన్ సరుకుల కోత జాబితాలో చేరిన గోధుమ పిండి

రేషన్ సరుకుల్లో కందిపప్పునకు కోతేశారు.. గోధుమ పిండి పంపిణీని మరిచారు. కొన్ని నెలలుగా రేషన్ అంటే బియ్యం మాత్రమే ఇస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర విపరీతంగా పెరిగిపోయింది. ఆ భారం నుంచి తప్పించుకునే క్రమంలో రేషన్‌లో కందిపప్పును పక్కన పెట్టేశారు. రేషన్ సరుకుల కోత జాబితాలో గోధుమపిండి కూడా చేరిపోయింది. గతంలో బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగితే వాటిని క్రమబద్ధీకరించే చర్య ల్లో భాగంగా ప్రభుత్వం సబ్సిడీపై వాటిని రేషన్ స్టోర్లు, రైతుబజారుల ద్వారా పంపిణీ చేసేది. అయితే వైసీపీ ప్రభుత్వం ధరల క్రమబద్ధీకరణ అనే విషయాన్నే విస్మరించింది. పైగా రేషన్ సరుకుల్లో వాటికి కోత వేసి కార్డుదా రుల బాధలను పట్టించు కోవడం లేదన్న విమర్శలున్నాయి. రేషన్ సరు కుల కోత, మరో వైపు ధరల భారంతో పేదలు ఇక్కట్లు పడుతున్నా అటు అధికా రులు, ఇటు పాలకులకు పట్టడంలేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గతంలో రేషన్ స్టోర్లు మిని మాల్స్‌గా ఉండేవి. సబ్సిడీపై బియ్యం, కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ తదితరాలను కార్డుదారులకు ప్రభుత్వం అందజేసేది. అయితే వైసీపీ ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన అంటూ పేదల పొట్టకొట్టింది. వ్యవస్థ ప్రక్షాళన ఏమో కానీ తమకు అందే సరుకుల్లో కోత పడిందని తెల్లకార్డుదారులు వాపోతున్నారు. ఇంటి వద్దకు రేషన్ అని చెప్తూ ఓ వాహనం, దానికో డ్రైవర్, హెల్పర్‌ను నియమించి కేవలం ఒక్కో లబ్ధిదారుడికి ఐదు కేజీల బియ్యంతో సరిపుచ్చుతోంది. రేషన్ సరుకుల్లో కందిపప్పు, గోధుమ పిండి పంపిణీని నిలిపివేసింది. తెల్లకార్డుదారులకు ఐదు నెలలుగా ప్రభుత్వం కందిపప్పు పంపిణీపై మొండిచేయి చూపుతున్నది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో ధర రూ.180 నుంచి రూ.190 వరకు ఉంది. మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే రాయితీపై కందిపప్పు పంపిణీని పౌరసరఫరాల శాఖ పూర్తిగా విస్మరించింది. కందిపప్పు అడిగితే స్టాక్ లేదనే సమాధానంతో సరిపుచ్చుతున్నారు. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ.67కు ఇవ్వాల్సి ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో దాదాపు రూ.100 నుంచి రూ.110 వరకు అధికంగా ఉండటంతో కార్డుదారులు రాయితీ కందిపప్పు పంపిణీ చేయాలని కోరుతున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. కందిపప్పు ధర మార్కెట్‌లో పెరగడంతో ఆ భారం తప్పించుకునేందుకే సరఫరాను నిలిపివేసిందన్న విమర్శలున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.45 నుంచి రూ.50 వరకు ఉంది ప్రభుత్వం రాయితీపై కిలో రూ.16కు అందిస్తోంది. దీంతో కార్డుదారులు గోధుమ పిండి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గోధుమ పిండి సరఫరాను కూడా నిలిపివేసింది. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కందిపప్పు పంపిణీని ప్రభుత్వం దాదాపుగా నిలిపివేసింది.



- పల్నాడు జిల్లాలో 6,45,110 తెల్లకార్డులు ఉన్నాయి. ఒక్కొక్క కార్డుదారుడికి కిలో కందిపప్పు అందజేయాలి. మేలో ఎన్నికలు ఉండటంతో 48.21 శాతం కార్డుదారులకు 2,85,104 ప్యాకెట్ల కందిపప్పును పంపిణీ చేశారు. ఎన్నికలు పూర్తవడంతో జూన్‌లో కార్డుదారులకు మొండిచేయి చూపనుంది. గోధుమ పిండి గత నెలలో 10.87 శాతం కార్డులకు పంపిణీ చేశారు. ఈ నెలలో 1.17 శాతం కార్డులకు సరఫరా చేయనున్నారు.
- బాపట్ల జిల్లాలో 4,86,029 తెల్లకార్డులు ఉన్నాయి. ఈ నెలలో 0.03 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేశారు. గోధుమ పిండి గత నెలలో 12.85 శాతం కార్డులకు ఈ నెలలో 1.12 శాతం కార్డులకు సరఫరా చేశారు.
- గుంటూరు జిల్లాలో 5,99,511 తెల్ల కార్డులు ఉన్నాయి. మే నెలలో 16,634 ప్యాకెట్ల కందిపప్పు పంపిణీ చేశారు. గోధుమ పిండి గత నెలలో 9.73 శాతం కార్డులకు పంపిణీ చేయగా ఈ నెలలో 1.52 శాతం కార్డులకు పంపిణీ చేయనున్నారు.

ఈవీఎంలదే.. తొలి ఫలితం



- పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు మధ్యాహ్నం తర్వాతే
- అరగంట ముందే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభం
- తతంగమంతా పూర్తి అయ్యేందుకు కొన్ని గంటల సమయం
- అదే ఈవీఎంల లెక్కింపు ప్రతీ అరగంటకు ఒక రౌండ్ పూర్తి

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపులో ప్రప్రథమం గా ఈవీఎంల ద్వారా కౌంటింగ్ చేసిన తొలి రౌండ్ ఫలితమే ముం దుగా వెలువడుతుంది. పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు లెక్కింపు అరగంట ముందే ప్రారంభమౌతుందని, దీనివల్ల వాటి ఫలితాలే ముందు వస్తా యని చాలామంది అపోహలకు గురౌతున్నారు. అది నిజం కాదని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంల లెక్కింపు కంటే అరగంట ముందుగా పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తామని, అయితే వాటి లెక్కింపు చాలా సమయం పడుతుందంటున్నారు. శాసనసభ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మధ్యాహ్న సమయం దాట వచ్చని, గుంటూరు పార్లమెంట్‌కు మాత్రం సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య సమయం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనేక నియమ నిబంధనలున్నాయి. ఇవి స్థానిక సంస్థల ఎన్నికల్లో వినియోగించే బ్యాలెట్ ఓట్లు లాంటివి కావు. ఉద్యోగులు, దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు దాటి ఇంటి వద్దనే ఓటు వేసిన వారు, అత్యవసర సేవల్లో ఉన్న వారు, సర్వీసు ఓటర్లు వేసిన ఓట్లు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కవర్ల రూపంలో బ్యాలెట్ బాక్సులలో నిక్షిప్తమై ఉన్నాయి. కౌంటింగ్ సందర్భంగా ఈ నెల 4న ఉదయం స్ట్రాంగ్‌రూం సీలు తెరిచి హాల్‌లోకి తీసుకొస్తారు. ఏజంట్ల సమక్షంలో బాక్సులు తెరిచి కవర్లను ఓపెన్ చేయడం ప్రారంభిస్తారు. అంతకంటే ముందు రిటర్నింగ్ అధికారి పోస్టల్ బ్యాలెట్‌లు మొత్తం ఎన్ని అనేది అబ్జర్వర్‌కు వివరిస్తారు. పెద్ద కవర్ తెరిచిన తర్వాత డిక్లరేషన్ ఫారం విడిగా ఉండాలి. అలానే ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ వేరే కవర్‌లో ఉండాలి. బ్యాలెట్ పేపర్ ఉన్న కవర్ సీలు తెరిచే ముందు డిక్లరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. డిక్లరేషన్ ఫారం లేకపోయినా, దానిపై అటెస్టింగ్ అధికారి సంతకం చేయకపోయినా, పోస్టల్ బ్యాలెట్ పేపర్ ఉన్న కవర్ సీరియల్ వేర్వేరుగా ఉన్నా బ్యాలెట్ పేపర్ నిక్షిప్తం అయి ఉన్న కవర్‌ని తెరవకుండానే తిరస్కరిస్తారు. అటెస్టింగ్ అధికారి సీలు లేకపోయినా, పేరు, హోదా లేకపోయినా తిరస్కరించడానికి వీల్లేదు. అన్ని చెక్‌లు అయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఉన్న కవర్‌ని ఓపెన్ చేస్తారు. అందులోనూ కొన్ని చెక్స్ చేపడతారు. ఏ అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టకపోయినా, ఒకరి కంటే ఎక్కువ మందికి టిక్ కొట్టినా, డ్యామేజ్ అయి ఉన్నా వాటిని కూడా తిరస్కరిస్తారు. ఆ తర్వాతే ఓట్ల లెక్కింపు చేపడతారు. ఏజంట్లకు చూపించి అభ్యర్థుల బాక్సులలో వేస్తారు. ఆ తర్వాత అభ్యర్థి వారీగా వచ్చిన ఓట్లు లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరు అభ్యర్థుల మధ్య ఓట్ల వ్యత్యాసం తిరస్కరించిన వాటి కంటే తక్కువ ఉంటే మరోసారి లెక్కిస్తారు. ఈ తతంగం అంతా పూర్తి అయ్యే సరికి కొన్ని గంటల సమయం పడుతుంది. మరోవైపు ఈవీఎంల లెక్కింపు ఉదయం 8.30 గంటలకు ప్రారంభమౌతుంది. అవి కౌంటింగ్ టేబుల్స్ మీదకు రాగానే సీలు తెరిచి రిజల్ట్ బటన్ నొక్కుతారు. ఆ వెంటనే ఒక్కో అభ్యర్థికి ఎన్ని ఓట్లు ఆ పోలింగ్ బూత్‌లో వచ్చాయనేది తెలుస్తుంది. ప్రతీ అరగంటకు ఒక రౌండ్ లెక్కింపు పూర్తి అవుతుంటుంది. ఈ నేపథ్యంలో ఫలితాల సరళి తొలుత ఈవీఎంలలో వచ్చిన ఓట్ల ద్వారానే తెలుస్తుంది. ఎప్పుడైతే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుందో అప్పుడు వాటిని తీసుకొచ్చి ఈవీఎం ఫలితాలతో కలిపి ప్రకటిస్తారు.

ఎమ్మెల్యే పిన్నెల్లి నుంచి ప్రాణహాని

సుప్రీంకోర్టులో శేషగిరిరావు పిటీషన్.. రేపు విచారణ

నరసరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ పాల్వా యిగేటు టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టును శనివారం ఆశ్ర యించారు. పిన్నెల్లికి 6వ తేదీ వరకు అరెస్టు నుంచి హైకోర్టు ఇచ్చిన మినహాయింపును రద్దు చేయాలని శేషగిరిరావు పిటిషన్‌లో కోరారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో పిన్నెల్లి తనపై దాడి చేశారని కూడా పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు రోజు కూడా పిన్నెల్లి హింసకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. ఆధారాలున్నా ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టారని ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ దాఖలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూలంగా అధికారులు వ్యవహరించారని అందులో పేర్కొన్నారు. ఈ అంశాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ ఇచ్చిందన్నారు. తీవ్ర ఘటనలైనా పిన్నెల్లికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై శేషగిరిరావు ఆందోళన వ్యక్తం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు. శేషగిరిరావు దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది.

ఓట్ల లెక్కింపునకు సిద్ధం

- పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా
- బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల చుట్టూ రెడ్ జోన్ : ఎస్పీ

బాపట్ల, జూన్ 1: ఓట్లలెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని ఓట్లలెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఓట్లలెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్లలెక్కింపునకు పటిష్టమైన బందోభస్తూ ఏర్పాటు చేశామన్నారు. 14 ఓట్లలెక్కింపు కేంద్రాలు ఉండగా 12 కేంద్రాల్లో ఈవీఎంలు, రెండు కేంద్రాల్లో పోస్టల్‌బ్యాలెట్లు లెక్కిస్తామన్నారు. కళాశాల ప్రవేశ ద్వారం నుంచి 100 మీటర్ల లోపు వాహనాలకు అనుమతిలేదన్నారు. వాహనాలకు పార్కింగ్ జోన్ సిద్ధం చేశామన్నారు. లెక్కింపు అధికారులు, సిబ్బంది ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తప్ప ఇతరులను కౌంటింగ్ జరిగే కళాశాల పరిసరాల్లోకి అనుమతి లేదన్నారు.

బాపట్లలో పూర్తి నిఘా : ఎస్పీ వకుల్ జిందాల్

కౌంటింగ్ రోజు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిని రెడ్‌జోన్‌గా పరిగణించడంతోపాటు పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల పట్టణంలో పూర్తి నిఘా ఉంటుందన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థులు, ఏజెంట్లు వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాల పార్కింగ్ చేయాలని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలను సిబ్బందితో కలిసి ఎస్పీ పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశంలోకి వెళ్లడానికి, రావడానికి అనువుగా ర్యాంప్‌లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టర్, ఎస్పీల వెంట డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, ఆర్వోలు, డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, రూరల్ సీఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల పరిసరాలను ఎస్పీ వకుల్‌జిందాల్‌తో కలిసి పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

పార్కింగ్ ప్రదేశాలు ఇలా..

- కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థు లందరూ కమ్మజనసేవాసమితి కల్యాణమండపం పక్కన, దానిఎదురుగా ఉన్న రెండు ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- అధికారులు, సిబ్బంది, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ అధికారులు విలియంబూత్ జూనియర్ కళాశాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయాలి.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే టీడీపీ, ఇండిపెండెంట్ ఏజెంట్లు చీరాల రోడ్డులోని జాతీయ రహదారి వై జంక్షన్ సమీపంలో రాయల్‌మెరైన్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే వైసీపీ, ఇండిపెండెంట్ ఏజెంట్లు వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమపాఠశాల ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే కాంగ్రెస్, ఇండిపెండెంట్ ఏజెంట్లు చీరాల రోడ్డులోని వై జంక్షన్ వద్ద రాయల్ మెరైన్ స్థలం ఎదురుగా వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే టీడీపీ, ఇండిపెండెంట్ ఏజెంట్లు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల వెనుక సుబ్బారెడ్డిపాలెం రోడ్డు వద్ద ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే వైసీపీ ఏజెంట్లు జాతీయ రహదారి నుంచి నాగేంద్రపురం వెళ్ళే రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే కాంగ్రెస్, ఇండిపెండెంట్ ఏజెంట్లు ఇంజనీరింగ్ కళాశాల వెనుక సుబ్బారెడ్డి పాలెం రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.



కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

టిక్..టిక్..టిక్

- హీట్ పెంచిన ఎగ్జిట్ పోల్స్
- మరింత జోరందుకున్న బెట్టింగులు
- 48 గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కొన్ని గంటల్లోకి వచ్చేసింది. మరో 48 గంటల వ్యవధిలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో సర్వత్రా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దేశ వ్యాప్తంగా తుది దశ పోలింగ్ శనివారం సాయంత్రం 6 గంటలతో పూర్తి కాగా అర గంట తర్వాత వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌ని కూడా ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ఇప్పటికే భారీగా జరుగుతున్న బెట్టింగ్‌లు ఎగ్జిట్ పోల్స్‌తో మరింత జోరందుకున్నాయి. ఇంచు మించు రెండున్నర నెలల ఎన్నికల ప్రక్రియ కొన సాగిన అనంతరం మరికొన్ని గంటల్లో తుది దశకు చేరుకోబోతోన్నది. ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం సరిగ్గా 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో తొలుత లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఓటరు ఏ పార్టీకి తీర్పు ఇచ్చాడో ఆ రోజున తేలిపోతుంది. కాగా శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ రాజకీయ వాతా వరణాన్ని మరింత వేడెక్కించాయి. సర్వే ఫలితాలు అనుకూలంగా ఇచ్చిన సంస్థలకు జేజేలు కొడుతూ ఏ సంస్థ అయితే తమ అంచనాకు భిన్నంగా పేర్కొన్నదో దానిని తూర్పారబడుతూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారు. జాతీయ స్థాయి ఛానెళ్లు మొదలుకుని అనేక సర్వే సంస్థలు టీడీపీ కూటమికి అనుకూలంగా ఫలి తాలు వస్తాయని పేర్కొన్నాయి. ఒకటి, రెండు మాత్రం వైసీపీకి మళ్లీ అధికారం వస్తుందని అంచనా వేశాయి. అయితే ఈ సర్వేల శాస్త్రీయత ఎంతవరకు వాస్తవమనేది మంగళవారం సాయంత్రంతో తేలిపోతుంది. ఇదిలావుంటే ఎగ్జిట్ పోల్స్ సర్వేల ఆధారంగా బెట్టింగ్‌రాయుళ్లు మరింత జోరు పెంచారు. ఆన్‌లైన్‌లోనూ పలు సంస్థలు నిర్వహిస్తున్న బెట్టింగ్‌లపై పందేలు కాస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా నిర్వహించే బెట్టింగ్‌లలో 10 శాతం కమీషన్ పోతుంది. అదే బెట్టింగ్‌యాప్‌లు, సైట్‌లలో అయితే ఎలాంటి కమీషన్ ఉండదు.యాప్‌ల ద్వారా కాసే బెట్టింగులలో గెలిస్తే నగదు నేరుగా బ్యాంకు అకౌంట్‌లోకే వస్తుంది. దీంతో బెట్టింగ్ యాప్‌ల వైపు కొంతమంది మొగ్గు చూపుతున్నారు.



వేసవి క్రీడా శిక్షణకు.. మంగళం

- ఎన్నికలు ముగిశాక అంటూ తొలుత ప్రకటన
- కోడ్ సాకుగా చూపుతూ పూర్తిగా విస్మరించిన వైనం

బాపట్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రం గాల్లో క్రీడారంగం కూడా చేరిన సంగతి తెలి సిందే. గతేడాది ప్రభుత్వం తలపెట్టిన ఆడు దాం ఆంధ్రా కార్యక్రమం కూడా సరైన నిర్వ హణ లేకపోవడంతో అభాసుపాలైంది. ఇక వేసవి క్రీడా శిక్షణా శిబిరాలపై కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం పరిపాటిగా మారింది. ఐదేళ్ల పాలన లో రెండేళ్లు మాత్రమే వాటిని నిర్వహించింది. అది కూడా క్రీడాకారులకు ఎటువంటి ఆట సామగ్రి ఇవ్వకుండా, నామమాత్రపు నిధులు మంజూరు చేసి మమ అనిపించింది. గతేడాది వేసవి శిక్షణా శిబిరాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కేవలం రూ.2.25 లక్షలు మాత్రమే కావడం గమనార్హం. దాదాపు 60 సెంటర్లలో శిక్షణ ఇస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం చివరికొచ్చేసరికి అంతాకలిపి 40 చోట్ల కూడా శిబిరాలు నిర్వహించలేక చేతులెత్తేసింది. వాటిని మే ఆరంభం నుంచి చివరివరకు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో ముగిశాక ప్రారంభిస్తామని తొలుత ప్రకటించారు. ఎన్నికలు ముగిసి మూడు వారాలు దాటినా శిక్షణా శిబిరాలు ఊసే ఎత్తలేదు. ఈ లోగానే మే నెల ముగిసిపోవడంతో ఆటలు లేకుండానే వేసవి వెళ్లిపోయింది. ఈ ఏడాది ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలు లాంటివేమి లేవని ఆయా పాఠశాలల్లో ఉన్న క్రీడా కోచ్‌ల సారథ్యంలోనే విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తేల్చేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కోచ్‌లను సంప్రదిస్తే శిక్షణ ఇస్తారని చేతులు దులుపుకున్నారు. జిల్లాలోని సగం పాఠశాలల్లో ఆటలకు కోచ్‌లు లేరు. అలాంటిది లేని కోచ్‌లు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని చెప్పడం మొక్కుబడి తంతేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలుత ప్రకటించినట్లు మే 15నుంచి వేసవి శిక్షణా శిబిరాలు ఎందుకు నిర్వహించలేదన్న ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

నిధులు లేవనే సాకులా....

గతేడాది వేసవి శిక్షణా శిబిరాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కేవలం రూ.2.25 లక్షలు మాత్రమే. ఈ అరకొర నిధులతో శిబిరాల నిర్వహణ మొక్కుబడి తంతుగానే ముగించారు తప్పితే పిల్లలకు క్రీడాపరంగా వచ్చిన నైపుణ్యాలు శూన్యమనే చెప్పాలి. ఈ ఏడాది ఆ నిధులు కూడా లేకపోవడం వల్లే కోడ్ సాకుగా చూపి ప్రభుత్వం చేతులెత్తేసిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గత ప్రభుత్వంలో ప్రత్యేక శ్రద్ధ..

టీడీపీ ప్రభుత్వంలో పర్చూరులో నిర్మించిన క్రీడా ప్రాంగణాన్ని వైసీపీ పాలకులు ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోకుండా దానిని దాదాపు శిథిలావస్థ స్థితికి చేర్చారు. ఇటీవలే ఎన్నికల నిమిత్తం దానిని బాగు చేసి సిబ్బంది విడుల కోసం వాడుకుంటున్నారు. ఇలా టీడీపీ హయాంలో నిర్మించిన క్రీడా ప్రాంగణాలను అటెకెక్కించిన వైసీపీ, పాఠశాలల్లో కనీస స్థాయిలో కూడా క్రీడా పరికరాలు ఉంచడంలో విఫలమైంది. ఒక్క పైసా నిధులు వాటి కోసం నిధులు విదిల్చిన దాఖలాలు లేకపోవడంతో విద్యార్థులకు క్రీడల్లో మెలకువలు నేర్పేవారే కరువయ్యారు

హడావిడి తప్ప చిత్తశుద్ధి కరువు...

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల వ్యవధిలో విద్యార్థుల క్రీడల మీద పెట్టిన ఖర్చు ఎంతంటే అంతా కలిపి పది లక్షలలోపే. ఇదే గత ప్రభుత్వంలో చూసుకుంటే క్రీడా పనిముట్లు, శిబిరాలకోసం దాదాపు కోటి రూపాయలు పైనే వెచ్చించినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. నాలుగేళ్లుగా క్రీడల నిర్వహణ ఊసే మరచిన పాలకులు చివరి ఏడాది మాత్రం ఆడుదాం ఆంధ్రా పేరిట చేసిన హడావిడి ప్రచారానికే పరిమితమైంది. పైగా క్రీడలపేరిట వాటిల్లో కూడా రాజకీయాలు చొప్పించిన ఘనత వైసీపీది.

దిక్సూచి
DIKSUCHI

నిట్ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ



తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇనీషియల్ స్క్రీనింగ్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 146 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన వారు గరిష్ఠంగా ఆరేళ్లలో; పార్ట్ టైం అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తి చేయవచ్చు.

విభాగాలు-సీట్లు: ఆర్కిటెక్చర్ 8, కెమికల్ ఇంజనీరింగ్ 8, కెమిస్ట్రీ 7, సివిల్ ఇంజనీరింగ్ 13, కంప్యూటర్ అప్లికేషన్స్ 8, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 11, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 13, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ 7, మేనేజ్‌మెంట్ స్టడీస్ 7, మేథమెటిక్స్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 13, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ 8, ఫిజిక్స్ 6, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/డిజైన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాలకు పీజీ(హ్యూమానిటీస్/సోషల్ సైన్స్/ఎకనామిక్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కామర్స్/స్టాటిస్టిక్స్) పూర్తి చేసి ఉండాలి. మేథమెటిక్స్‌కు (మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)(ఎంఏ/ఎమ్మెస్సీ); ఫిజిక్స్‌కు పీజీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ మెటీరియల్స్ సైన్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్); కెమిస్ట్రీకి పీజీ(కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. విభాగాన్ని అనుసరించి డీఎస్‌టీ/డీఏఈ/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ క్యాట్/ఏఐఎంఏ/ఎక్స్ఏటీ/ వ్యాట్/ జీవ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్

- మొత్తం 146 ఫుల్ టైమ్ హెచ్‌టీఆర్ఏ ఫెలోషిప్పుతోపాటు విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కింద ఎలక్ట్రానిక్స్ & ఐటీ విభాగాల్లో మరో 5 ఫెలోషిప్స్ ఉన్నాయి.
- ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అయిదేళ్లపాటు ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలపాటు రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తూ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సూచనల ప్రకారం అకడమిక్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి పీఎంఆర్ఎఫ్ ఫెలోషిప్ వర్తిస్తుంది.
- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; తరవాత మూడేళ్లు నెలకు రూ.43,750 ఇస్తారు. హాస్టల్ సౌకర్యం లభించని వారికి ఫెలోషిప్ మొత్తంలో 16 శాతాన్ని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ రెంట్(ఆర్ఓఆర్)గా ఇస్తారు. రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1.2 లక్షలు; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సపోర్ట్ కింద రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 20 నుంచి 30 వరకు
- **వెబ్‌సైట్:** nitt.edu

ఐఐఎస్‌డబ్ల్యూబీఎంలో ఎంఎస్‌డబ్ల్యూ

కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యూబీఎం)- 'మాస్టర్స్ ఇన్ సోషల్ వెల్ఫేర్(ఎంఎస్‌డబ్ల్యూ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ సెషన్స్, ప్రజంటేషన్స్, సెమినార్లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ వర్క్స్ ఉంటాయి. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు: చైల్డ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కరెక్షనల్ సోషల్ వర్క్, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్, లేబర్ వెల్ఫేర్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ సహా ఏదేని ప్రొఫెషనల్ డిగ్రీ/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 28
- **రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** జూలై 10, 11
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 28 నుంచి
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా


చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎగ్జామ్‌కు సంబంధించిన మోడల్ పేపర్లను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1DWg1oeలో చదవండి.



కేదార్‌నాథ్‌లో తలైవా



నటుడిగా తను ఎంత బిజీగా ఉన్నా మధ్యలో వీలు చూసుకుని హిమాలయాలకు వెళ్లడం తలైవా రజనీకాంత్‌కు అలవాటు. కొన్ని రోజులు అక్కడే ధ్యానంలో గడుపుతుంటారు. అలాగే మే 29న ఆయన ఉత్తరాఖండ్ వెళ్లి కేదార్‌నాథ్, బదరీనాథ్ ఆలయాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ పోలీసులు ఆయనకు స్వాగతం పలికి, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కేదార్‌నాథ్‌లో రజనీకాంత్ ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సిద్ధమవుతున్న హరిహర వీరమల్లు



పవన్‌కల్యాణ్ తన కెరీర్‌లో తొలిసారిగా చేస్తున్న హిస్టారికల్ ఎపిక్ వారియర్‌మూవీ 'హరిహర వీరమల్లు'. 17 వ శతాబ్దంలో పేదల కోసం పోరాడిన యోధుడి పాత్రను ఆయన ఇందులో పోషిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతికృష్ణ బ్యాలెన్స్ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేయబోతున్నారు. భారీ బడ్జెట్‌తో ఎ.ఎం.రత్నం ఈ సినిమా నిర్మిస్తున్నారు. భారతదేశంలోనే అత్యంత డిమాండ్ ఉన్న సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస 'హరిహర వీరమల్లు' చిత్రానికి వర్క్ చేయనున్నారు. త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించే పనిలో నిర్మాత ఉన్నారు. ప్రస్తుతం లొకేషన్ల కోసం రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ షూట్ చేసిన సన్నివేశాలకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా శరవేగంతో పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది చివరికి 'హరిహర వీర మల్లు' పార్ట్ వన్ 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'ను విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్, సునీల్, నోరా ఫతేహి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

యాక్షన్ ప్యాక్డ్ మూవీ

వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు నాట అభిమానులను సంపాదించుకున్నారు తమిళ హీరో విజయ్ ఆంటోని. ఇప్పుడు ఆయన 'తుఫాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ నెల్లోనే



ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'తుఫాన్' యాక్షన్ ప్యాక్డ్ మూవీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "తుఫాన్' సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఒక దీవిలో జరిగే కథ ఇది. హీరో క్యారెక్టరైజేషన్ సరికొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. ఈ చిత్రాన్ని కమల్ బోరా, డి. లలిత నిర్మిస్తున్నారు. సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



బ్లాక్‌బస్టర్ గ్యారంటీ

శర్వానంద్

"మనమే' చిత్రం మ్యాజికల్ బ్లాక్ బస్టర్. ఈ సారి కుమ్మేశాం. ఇది రాసి పెట్టుకోండి. ఈ నెల 7న థియేటర్లలో కలుద్దాం. ఇది కుటుంబం అంతా కలసి ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా. 'శతమానం భవతి' కన్నా పెద్ద హిట్ అవుతుంది. మిమ్మల్ని ఏమాత్రం నిరాశపరచదు' అని శర్వానంద్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'మనమే'. కృతిశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ 'ట్రైలర్‌లో మీరుచూసింది కొంచెమే. 'మనమే' అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. మీ తల్లితండ్రులకు చూపించండి. ఈ సారి కొత్త శర్వాను చూడబోతున్నారు. కృతి తన నటనతో ఇరగదీసింది' అన్నారు. సినిమాలో ఎమోషన్‌తోపాటు ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది అని కృతిశెట్టి చెప్పారు. ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ప్రేక్షకులు ఆదరించాలి అని వివేక్ కూచిభొట్ల కోరారు.

డూప్ లేకుండా కాజల్ యాక్షన్ సీక్వెన్స్ చేశారు

\- సుమన్ చిక్కాల



'ఎమోషన్, యాక్షన్ అంశాలతో 'సత్యభామ' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. యాక్షన్ పార్ట్ కోసం కాజల్ అగర్వాల్ ఎంతో కష్టపడ్డారు. చాలా ధైర్యంగా స్టంట్స్ చేశారు' అని దర్శకుడు సుమన్ చిక్కాల అన్నారు. కాజల్ అగర్వాల్ పోలీసాఫీసర్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడారు.

● సినిమాలపై ఆసక్తి ఉండడంతో ఉద్యోగం చేస్తూనే చిత్రపరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించాను. దర్శకుడు శశికిరణ్ తీసిన కొన్ని సినిమాలకు పనిచేశాను. ఆయన ఈ సినిమాకు దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చారు. కొంతమంది పోలీసుల జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా కథ రాసుకున్నాను.

● అయితే 'సత్యభామ' కథ రాయడం పూర్తయ్యాక లీడ్‌రోల్‌లో ఎవరైనా హీరోయిన్ చేస్తే బావుంటుంది అనుకున్నాం. కాజల్ కథ వినగానే 'ఎస్' చెప్పారు. డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్‌లు చేశారు. సత్యభామ తన దగ్గరకు వచ్చిన ఒక కేసును పర్సనల్‌గా తీసుకుంటుంది. ఎమోషనల్ అవుతుంది. బాధితురాలికి న్యాయం చేసేందుకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమవుతుంది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కాజల్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఆ విల్లాలో ఏం జరిగింది?



విజయ్, శీతల్ భట్ జంటగా నటించిన 'విల్లా 369' చిత్రం షూటింగ్ పూర్తయింది. సురేశ్ ప్రభు దర్శకత్వం వహించారు. ' ఆ విల్లాలో ఏం జరిగింది అనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో చిత్రాన్ని రూపొందించాం. సెన్సార్ పూర్తి చేసి, త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం. టీజర్, ట్రైలర్ కూడా రిలీజ్ చేస్తాం' అని ఆయన చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మహావీర్, ఫొటోగ్రఫీ: ఎస్.కె.రఫీ, లైన్ ప్రొడ్యూసర్: శీలం ప్రణయ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: ఎం.లక్ష్మణ్‌బాబు, చిత్రం శ్రీను.

పిల్లలతో విహార యాత్ర



తమిళ దర్శకుడు విఘ్నేశ్ శివన్, హీరోయిన్ నయనతార దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ప్రస్తుతం హాంకాంగ్ పర్యటనలో ఉన్నారు. డిస్నీల్యాండ్ రిసార్ట్‌లో దిగిన ఫొటోలను విఘ్నేశ్ షేర్ చేస్తూ 'పన్నెండేళ్ల క్రితం 'పోడా పోడీ' షూటింగ్ కోసం ఇక్కడికి వచ్చాను. అప్పుడు నా దగ్గర వెయ్యి రూపాయలే ఉన్నాయి. షూస్ కూడా లేవు. చెప్పులతో ఈ ప్రదేశమంతా తిరిగా. ఇప్పుడు నా భార్య, పిల్లలతో ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది' అంటూ పేర్కొన్నారు.

హనీమూన్ సాంగ్



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్టైనర్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. సుహాసినీ, తనికెళ్ల భరణి కీలకపాత్రలు పోషిస్తున్నారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాల రాజ్ నిర్మించారు. శనివారం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' టైటిల్ సాంగ్‌ను దర్శకుడు కె. రాఘవేంద్రరావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు బాల మంచి టైటిల్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. టైటిల్ సాంగ్ చాలా బావుంది. ఈ సినిమా మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. పాప్ సింగర్ స్ఫూర్తి జితేందర్ ఈ టైటిల్ పాటను స్వరపరిచి, ఆలపించారు. ఈ చిత్రానికి సంగీతం : కల్యాణి మాలిక్, సినిమాటోగ్రఫీ: శిష్టా వీఎంకే





కారంపూడి సీఐ ఎన్నికల విధులకు దూరం

● రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశం



సీఐ నారాయణస్వామి

మాచర్లటౌన్, జూన్ 1: కారంపూడి అల్లర్లలో సీఐ నారాయణస్వామి అలసత్వం ప్రదర్శించారని మాచర్ల వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టులో ఫిర్యాదు చేయగా ఈమేరకు కౌంటింగ్ పూర్తయ్యే వరకు సీఐ నారాయణస్వామిని విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. గుంటూరు రేంజీఐజీ త్రిపాఠి, పల్నాడుజిల్లా ఎస్పీ మల్లికా గార్గ్, కారంపూడి సీఐ నారాయణస్వామిలపై పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టులో ఫిర్యాదు చేయగా, ఈ విషయంపై 24 గంటల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశించింది. దీంతో ఎన్నికల సంఘం శనివారం కారంపూడి సీఐ నారాయణస్వామిని కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. అలాగే రామకృష్ణారెడ్డి ఇతర అధికారులపై సాక్ష్యాదారాలు సమర్పిస్తే సిట్ బృందంతో విచారణ జరుపుతామని ఎన్నికల కమిషన్ పేర్కొంది.

సామాజికన్యాయ సాధనే లక్ష్యంగా ఉద్యమం

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గుంటూరు, జూన్ 1: సమస్త జీవన రంగాలలో అణగారిన వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వారి జనాభా దామాషా మేరకు వాటా కోటాలను కేటాయించేలా సామాజికన్యాయ సాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఉద్యమిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత వర్గాలతో సమాన స్థాయిలో అభివృద్ధి చెందేలా, అన్ని వర్గాల సాధికారతకు కృషి చేయడమే సామాజిక న్యాయమన్నారు. ఏవో కొన్ని పదవులు కొద్ది మంది అట్టడుగు వర్గ నాయకులకు ఇవ్వడం, కొద్ది లబ్ధిని చేకూర్చే పథకాలను అమలు చేసినంత మాత్రానే అణగారినవర్గాలకు సామాజిక న్యాయం అందించినట్లుగా భావించరాదన్నారు. అలాగే పలు ప్రాజెక్టులు, పరిశ్రమలు, పెద్ద భవంతులతో మహా నగరాలను నిర్మించినంత మాత్రాన పేదలు, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి జరిగినట్లు కాదన్నారు. దేశ జనాభాలో 85 శాతంగా ఉన్న బలహీనవర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలందరికీ విద్య, వైద్యం, వర్తక- వాణిజ్య, పారిశ్రామిక రంగాలు, వ్యవసాయం, ఇతర సామాజిక వనరులన్నింటిలోనూ, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలన్నింటిలోనూ, జనాభా దామాషా మేరకు వాటా కోటాలను కేటాయించి, సమగ్ర అభివృద్ధి వైపుగా కృషి జరిగినప్పుడే ఆయా వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించనట్లుగా, అదే నిజమైన మానవాభివృద్ధిగా భావించాలని తెలియజేశారు. మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల ఆలోచ నల మేరకు' సామాజిక న్యాయ సాధనే లక్ష్యంగా బీసీలు, మిగతా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరినీ కలుపుకొని, ఐక్యంగా ఉద్యమిద్దామని కేసన శంకరరావు పిలుపునిచ్చారు.

ఏఎన్‌యూకి రెండు రోజులు సెలవులు

పెదకాకాని, జూన్1 :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)కి ఈ నెల 3,4 తేదీలలో (రెండు రోజులు) సెలవులు ఇచ్చినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ.కరుణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో 2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో వీసీ పీ.రాజశేఖర్ ఆదేశాల మేరకు సెలవులు కేటాయించినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ ఉద్యోగస్తులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

రాష్ట్రంలో కూటమి ప్రభంజనమే..

● ఎగ్జిట్‌పోల్స్‌కు మించి ఆధిక్యం ఖాయం
● వైసీపీకి డిపాజిట్లు గల్లంతు
● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



విలేకరులతో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 1: జూన్4 ఫలితాల్లో రాబోతోన్నది కూటమి ప్రభంజనమేనని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. శనివారం తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎగ్జిట్‌పోల్స్‌కు మించిన సీట్లు, ఆధిక్యాలతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందన్నారు. ఇప్పుడు వైసీపీ పాలనకు అసలైన కౌంట్ డౌన్ మొదలైందని, ఫలితాల సునామీలో ఆ పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకు పోవటం ఖాయమన్నారు. మరో రెండు మూడు రోజుల్లో రాక్షస పాలన నుంచి ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించ పోతున్నాయని ప్రత్తిపాటి హర్షం వ్యక్తం చేశారు. వైకాపా పాలన పట్ల ప్రజలు ఎంత విసిగి పోయారో అనేది త్వరలో అర్థమవుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఎదురు లేదని తెలి పారు. తాము ఇన్నిరోజులు చెపుతున్నదే నిజమైందన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించి అధికార వైసీపీ ఎన్నికల ముందే చేతులెత్తేసిందని, తుది ఫలితాల్లోను అదే కన్పిస్తుందని ప్రత్తిపాటి వ్యాఖ్యా నించారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక ఆధిక్యంతో విజయం అందించబోతున్న చిలకలూరిపేట ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చటమే ఇక తమ ప్రాధాన్యంగా పెట్టుకుంటామని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

నియంత పాలనకు సమాధి

● వినుకొండ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 1: జగనరెడ్డి అరాచక, నియంత పాలనకు ప్రజలు సమాధి కట్టేశారని వినుకొండ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్‌పై ఆయన స్పందిస్తూ.. ఐదేళ్ళుగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజల్ని పీడించుకు తిన్న విధానాలే వారి దారుణ పరాజయానికి కారణాలుగా నిలిచాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి, అమరావతిని విధ్వంసం చేసి, ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగుల ఉసురు పోసుకొన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు తగినశాస్తి చేశారన్నారు. టీడీపీ కూటమి గెలుపు ఖాయమని తాము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామని, ఎన్నికల ముందొచ్చిన 15 సర్వేలు కూటమికే ఏకపక్షంగా అధికారాన్ని కట్టబెట్టాయన్నారు. రికార్డు స్థాయిలో నమోదైన పోలింగ్, పోటెత్తిన పోస్టల్ బ్యాలెట్ కూడా వైసీపీ ఓటమిని నిశ్చయించాయన్నారు. వినుకొండ నియోజకవర్గానికి భూబకాసురునిగా మారిన బొల్లా బ్రహ్మనాయుడు నుంచి ప్రజలకు విముక్తి కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేనంత మెజారిటీతో బొల్లాపై విజయం సాధించబోతున్నామన్నారు. 150 స్థానాలకు పైగా సాధించి చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారన్నారని జీవీ తెలిపారు.

బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు

చిలకలూరిపేట జూన్ 1: హైదరాబాద్ నుంచి చిలకలూరిపేట మీదుగా కందుకూరు వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు శనివారం ఉదయం నరసరావుపేట - చిలకలూరి పేటల మధ్య లింగంగుంట్ల గ్రామం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. తొలుత బస్సు ఒక స్తంభానికి ఢీ కొని అదుపు తప్పింది. బస్సులో మొత్తం 40 మంది ప్రయాణీకులు ఉన్నట్టు సమాచారం. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో చిలకలూరిపేట, నరసరావుపేటలలోని ఆస్పత్రులకు తరలించారు.



బగళాముఖి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

ఆలయ అభివృద్ధికి కృషి

● దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ
● బగళాముఖి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, జూన్ 1 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారి ఆలయాన్ని దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కమిషనరుకు ముందుగా ఆలయ మర్యాదాలతో పూర్ణాకుంభంతో ఘనస్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ బగళాముఖి అమ్మవారి ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధి విషయంలో ఎటువంటి సహకారం అవసరమైన వెంటనే స్పందిస్తానని తెలియజేశారు. ప్రముఖ పండితులు చందోలు శాస్త్రి గృహాన్ని సందర్శించారు. వారి గ్రంథాలు చాలా విలువైనవి ఉన్నాయని, వాటిని దేవదాయశాఖ తరుపున ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ముఖ్యంగా 'శ్రీశైల ఖండం' అనే పుస్తకాన్ని ముద్రించటానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఆశ్రమ నిర్వాహకులు శ్రీలక్ష్మీధర సోమయజలు కమిషనర్ సత్యనారాయణకు తెలియజేశారు. డిప్యూటీ కలెక్టర్, కనకదుర్గదేవస్థానం ఈవో కేఎస్.రామారావు, బాపట్ల డీఈవో ఎం.పానకాలరావు, శ్రీశైల దేవస్థానం ఆస్థాన పండితులు సీతారామంజనేయ శర్మలు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఆలయ అర్చకులు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణాకెనాల్ జంక్షన్ మధ్యన రోలింగ్ కారిడార్ బ్లాక్ పనుల కారణంగా రెండు వారాల పాటు కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14 వరకు నెంబరు 07464 విజయవాడ - గుంటూరు, 07465 గుంటూరు-విజయవాడ, 07976 గుంటూరు- విజయవాడ, నెంబరు. 17329 హుబ్లీ - విజయవాడ రైళ్లను రద్దు చేశామన్నారు. నెంబరు. 17330 విజయవాడ - హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2 నుంచి 15 వరకు రద్దు చేస్తున్నామన్నారు. నెంబరు 12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ని ఈనెల 1 నుంచి 14వ తేదీ వరకు తెనాలి నుంచి నేరుగా విజయవాడకు మళ్లిస్తామన్నారు. నెంబరు 16031 చెన్నైసెంట్రల్ - కాత్రా ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 1 నుంచి 14వ తేదీ వరకు, నెంబరు. 16093 చెన్నై సెంట్రల్ - లక్నో ఎక్స్‌ప్రెస్ కూడా తెనాలి నుంచి విజయవాడకు మళ్లిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిలకలూరిపేట జూన్ 1 : నరసరావు పేట - చిలకలూరిపేట రహదారిపై తూబాడు గ్రామంవద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళ గాయపడింది. నరసరావుపేట నుంచి 8మంది కూలీలతో ఒక ఆటో చిలకలూరిపేట వైపుకు వస్తుండగా నరసరావుపేట వైపు వెళ్తున్న ఒక లారీ ఆ ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమా దంలో నాగూర్‌బీ(23) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, అమీరున్ అనే మహిళ గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలిచారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా
హనుమాన్ జయంతి ఉత్సవం



హనుమంతుడి విగ్రహానికి పూజలు చేస్తున్న లావు రత్తయ్య,శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు విద్య, జూన్ 1: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ హనుమాన్ జీవిత చరిత్ర నుంచి కమ్యూనికేషన్ స్కిల్స్, ఎదుటివారిని మెప్పించే నైపుణ్యం, విధేయత, నమ్మకం, విశ్వసనీయతతో ఎలా ఉండాలో నేర్చుకోవచ్చన్నారు. విద్యార్థులందరూ హనుమంతుని లాగా అన్ని తెలిసినా ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాస, ధర్మరక్షణ కోసం శ్రమించే వీరత్వం, ఆపద సమయంలో ప్రదర్శించే ఆత్మవిశ్వాసం లాంటివి అలవర్చుకోవాలన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఆధునిక భావితరానికి చక్కని మార్గదర్శి అయిన హనుమంతుని జీవితాన్ని అధ్యయనం చేసిన వారికే ఆయన గొప్పతనం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరిలో భారీగా
మద్యం పట్టివేత

● కాంద్రువారి వీధిలోని ఓ ఇంట్లో లభ్యం
● మద్యం విలువ రూ.9.79 లక్షలు

మంగళగిరి సిటీ, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మంగళగిరిలో అధికార వైసీపీ చేయని ప్రయత్నం లేదు. ఓటుకు విచ్చలవిడిగా డబ్బు పంచడంతోపాటు ఎన్నికల మద్యాన్ని ఏరులై పారించింది. అనేక చోట్ల పెద్ద ఎత్తున మద్యం డంప్ చేసి ఓటర్లకు ఎర వేసింది. ఎన్నికల మద్యాన్ని నిల్వ ఉంచిన ఓ స్థావరంపై సెబ్ సిబ్బంది శని వారం సాయంత్రం ఆకస్మిక దాడి చేసి భారీగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళగిరి పట్టణంలోని కాంద్రు వారి వీధిలో దామర్ల వీరాంజనేయులు నివాసంలో ఎన్నికల మద్యం ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం సెబ్ అధికారులు దాడి చేయగా 136 కేసుల మద్యం బాటిళ్ల లభ్యమయ్యాయి. వీటిలో హైదరాబాద్ బ్లూ 120, ఓల్డ్ ట్రావెన్ 16 బాక్సులు వున్నాయని, రూ.9 లక్షల 79 వేల విలువ చేసే 6,528 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మద్యం బాటిళ్లపై ఎలాంటి సీల్డ్ స్టిక్కర్లు లేవని, నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని సెబ్ అధికారులు తెలియజేశారు. కాగా, నిందితుడి తరపున వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. సెబ్ కార్యాలయం వద్ద శనివారం రాత్రి తచ్చాడుతూ కనిపించారు. మీడియా ప్రతినిధులు రాగానే అక్కడి నుంచి ఉడాయించారు.

వడ దెబ్బకు ఇద్దరు మృతి

క్రోసూరు, జూన్ 1 : క్రోసూరు ఎస్సీ కాలనీలో వడ దెబ్బతో గుడేటి కోటిరత్నం(80) అనే వృద్ధురాలు శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలియ జేశారు. విపరీతమైన వడగాలులు, ఎండ వేడిమి తట్టుకోలేక 2 రోజుల నుంచి తీవ్ర అశ్వస్థతకు గురైన కోటి రత్నం శనివారం ఉదయం మరణించినట్లు తెలిపారు. టీడీపీ సానుభూతి పరురాలైన కోటిరత్నం కుటుంబ సభ్యులను పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఫోన్‌లో పరామర్శించారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాంద్రు కాశయ్య టీడీపీ నేతలు మన్నెం శ్రీనివాసరావు, దద్దుల యోహాన్, దారెడ్ల సీతారెడ్డి, నలజాల కోటేశ్వరరావు, అనుముల వెంకట రామిరెడ్డి, అనుమాల పూర్ణ తదితరులు కోటిరత్నం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నాదెండ్ల : మండలంలోని చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నేత నాలి వెంకటేశ్వర్లు(62) వడదెబ్బతో శనివారం మృతి చెందారు. ఆయన భార్య నాలి మంగమ్మ చిరుమామిళ్ళ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన భౌతికకాయాన్ని టీడీపీ నేతలు ఎం.జగన్నాధరెడ్డి, గాదె బ్రహ్మరెడ్డి, అంజిరెడ్డి, ఏ.వెంకటేశ్వర్లు, బీజేపీ నేత భవనం శ్రీనివాస రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

అక్రమంగా మద్యం తరలింపు

● నిందితుల్లో మద్యంషాపు సేల్స్‌మన్

తెనాలి క్రైం, జూన్ 1: అక్రమంగా ప్రభుత్వ మద్యం షాపు నుంచి మద్యం బాటిళ్ళను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సిఐ వెంకటాచలం తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని మారీసుపేట ప్రభుత్వ మద్యం దుకాణం నుండి 96 బాటిళ్ళ మద్యాన్ని గోతాల్లో ఉంచి ఆటోలో తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కౌంటింగ్ జరిగే రోజు ఈ మద్యాన్ని అధిక ధరలకు విక్రయించుకోవడానికి నలుగురు వ్యక్తులు వీటిని తరలిస్తున్నారని అదుపులోకి తీసుకున్న వారిలో మద్యం షాపు సేల్స్‌మెన్ కూడా ఉన్నాడని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్టు ప్రతినిధులు, కార్యక్రమంలో పాల్గొన్న పవర్ లిఫ్టర్లు

పవర్ లిఫ్టింగ్‌లో ఛాంపియన్‌గా
గుంటూరు జిల్లా జట్టు

మంగళగిరి సిటీ, జూన్ 1: మంగళగిరి ఈద్గా షాదీఖానా మైదానంలో జరిగిన ఏపీ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం రాత్రి జరిగిన బహుమతీ ప్రదానోత్సవంలో జిల్లా జట్టు తరపున గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని ట్రోఫీ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎన్‌సీ మోహన్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంటు ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, డీఎస్‌టీవో జీ.వెంకటేశ్వరరావు, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పీ.జాన్సన్, సంకా బాలాజీగుప్తా, కేకేఎల్‌వి ప్రసాద్, అనిల్ చక్రవర్తి, అన్నే రత్నప్రభాకర్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్ది ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, కోశాధికారి పీవీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే విశాఖ జపం

● రైతులకు అన్యాయం చేసిన వైసీపీకి అడ్రస్ గల్లంతే..
● 1628వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, జూన్1: సొంత ప్రయోజనాలు, స్వలాభం కోసమే సీఎం జగన్ విశాఖ రాజధాని జపం చేస్తున్నాడని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1628వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రాష్ట్ర నడిబొడ్డులోని అమరావతిని నాశనం చేయటం దుర్మార్గమన్నారు. లక్షల ఉద్యోగాలు యువతకు కలిగే అమరావతిని నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి ఈ ఎన్నికలలో అడ్రస్‌లో ఉండరన్నారు. అభివృద్ధి చేత కాని వారు అందలం ఎక్కటం ఎందుకని ప్రశ్నించారు. ఐదు కోట్ల మందిలో ఒక్కరైనా మూడు రాజధానులు కావాలని అడిగారా అని ప్రశ్నించారు. అధికార మదంతో మూడు రాజధానులని అమరావతిని నాశనం చేసిన వైసీపీ పాలకులు జూన్ 4 తర్వాత పెట్టే బేడా సర్దుకోవటమేనన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి , జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో రైతుల నిరసనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

వ్యవసాయ పారిశ్రామికీకరణ లక్ష్యంతో చదవాలి

● ప్రిజం క్రాప్ సైన్స్ డైరెక్టర్ సీహెచ్ పీవీ.సాంబశివరావు
● ఘనంగా వ్యవసాయ కళాశాల హాస్టల్‌డే వేడుకలు



సభలో మాట్లాడుతున్న సీహెచ్ పీవీ.సాంబశివరావు

బాపట్ల, జూన్ 1 : వ్యవసాయ విద్యార్థులు కేవలం ఉద్యోగ సముపార్జన కోసం కాకుండా వ్యవసాయ అనుబంధ పారిశ్రామిక కేంద్రాలు స్థాపించే లక్ష్యంతో చదవాలని ప్రిజం క్రాప్ సైన్స్‌డైరెక్టర్ సీహెచ్ పీవీ. సాంబశివరావు సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 79వ వార్షిక హాస్టల్‌డే వేడుకలు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ .శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి సాంబశివరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయవిద్య ద్వారా అద్భుతాలు సాధించవచ్చని, అన్నదాతకు దోహదపడే ఆధునీక టెక్నాలజీలను సృష్టించవచ్చుఅన్నారు. అభివృద్ధి చెందిన ఇతరదేశాలలోని వ్యవసాయ విద్య కంటే భారతదేశంలోని వ్యవసాయ విద్య ఉన్నతప్రమాణాలతో ఉంటుందన్నారు. కాబట్టి విద్యార్థులు తామే స్వంతంగా ఎదగాలనే ఆశయాన్ని కలిగి ఉండాలన్నారు. కంపెనీలు స్థాపించి తమ కష్టమే పెట్టుబడిగా భావించి సాగితే ఉత్తమఫలితాలు సాధిస్తారన్నారు.

విశిష్ట అతిథి జీఎస్టీ అడిషనల్ కమిషనర్ పీ.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థిదశ ఆహ్లాదకంగా సాగుతుందని పట్టా పుచ్చుకొని బాహ్య ప్రపంచంలోని వచ్చాక ప్రపంచ దోరణి అర్థం కావటంతో ఆందోళన కలుగుతుందన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రపంచ వాస్తవస్థితిగతులను అర్థంచేసుకొని చదువుతూ వచ్చినప్పుడే ఆపరిస్థితిని అదిగమించ వచ్చని అన్నారు. సెల్‌ఫోన్‌కు మాత్రమే ప్రపంచం కాకూడదని సూచించారు. పాఠ్యాంశాలతో పాటు జనరల్‌నాలెడ్జిని పెంపొందించుకోవాలన్నారు. సమయ పాలనపై ఖచ్చితత్వాన్ని అలవర్చుకున్నవారు మాత్రమే బంగారు భవిష్యత్తును పొందగలరన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ సూడెంట్ అఫైర్స్ డాక్టర్ పీ.సాంబశివరావు, యూనివర్సిటి రిజిస్ట్రార్ డాక్టర్ కే.గురవారెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. నూతన వసతిగృహ నిర్మాణానికి రూ.5.4కోట్ల మంజూరయ్యాయన్నారు. అథ్లెటిక్స్ ప్రోత్సాహకానికి 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ సిద్ధం చేయపడుతుందని తెలిపారు. క్రీడలు, సాంస్కృతిక రంగాలలో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ కే.చంద్రశేఖర్, బాలికల హాస్టల్ వార్డెన్ డాక్టర్ వీ.ప్రసన్నకుమారి, డాక్టర్ ఎస్.ఆర్.కోటేశ్వరరావు, డాక్టర్ పులి మోహన్‌రావు తదితరులు పాల్గొని ఎన్‌సీసీ క్యాడేట్‌లకు సర్టిఫికెట్‌లు, హాస్టల్ సిబ్బందికి నూతన వస్త్రాలు బహుకరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

● జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్‌కుమార్

బాపట్ల, జూన్ 1 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా జిల్లా వ్యాప్త ప్రత్యేక తనిఖీలలో భాగంగా శనివారం బాపట్ల పట్టణంలోని డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో హోటల్స్, బేకరీలు, మెకానిక్‌షాపులు, ఇతర షాపులను తనిఖీ చేశారు. షాపు యజమానులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకోరాదని, అలా ఎవరైనా చట్ట వ్యతిరేకంగా పిల్లలను పనిలో పెట్టుకున్నట్లైతే వారిపై చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం శిక్ష, జరిమాన విధించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ ఆర్.అబ్రహం, రామకృష్ణ, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు బడుగు కిషోర్, ఎం.నాగరాజు, రాజ సాల్మన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

భీమావారిపాలెంలో చోరీ



ఇంట్లో బీరువా పగలుగొట్టిన చిత్రం

బాపట్ల, జూన్ 1 : బాపట్ల పట్టణంలోని భీమావారిపాలెంలో శనివారం తెల్లవారుజామున దొంగలుపడ్డారు. ఆ ప్రాంతానికి చెందిన అందెల మల్లేశ్వరరావు సూర్యలంక రోడ్డులోని మీసేవ దగ్గర టీషాపు నిర్వహిస్తాడు. తెల్లవారుజామున ఇంటి తలుపులు దగ్గరకు వేసి షాపునకు వచ్చాడు. ఇంట్లో భార్య, ఇద్దరు బిడ్డలు నిద్రపోతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు పగలుగొట్టి అందులో ఉన్న బంగారు అభరణాలు, నగదును అపహరించారు. ఉదయం లేచి కుటుంబ సభ్యులు బీరువా పగలగొట్టి ఉండటాన్ని గమనించి మల్లేశ్వరరావుకు ఫోన్ చేసి చెప్పగా ఆయన వచ్చి విచారించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి క్లూస్‌టీమ్‌ను పిలిపించి పట్టణ సీఐ యు.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివరాలు సేకరిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చుండూరు జూన్ 1 : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి నెల రోజులు అయ్యింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయించమని రైతులు వేడుకుంటుంటే మా వద్ద విద్యుత్ పరికరాలు, సిబ్బంది లేరు అవి వచ్చే వరకు పంటలు ఎండిపోయినా మేము ఏమీ చేయలేమని తెనాలి విద్యుత్ శాఖ అధికారులు తెగేసి చెబుతున్నారు. దీనిపై యడ్లపల్లి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యడ్లపల్లిలోని ఎస్ఎస్ 20 రిలీవ్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి నెల రోజులకు పైగా గడిచిపోయింది. మరో ప్రక్క ఎండల వేడికి పంటలు దెబ్బతింటున్నాయి. రైతులు ఆర్థికంగా వ్యయ ప్రయాసలకోర్చి ట్రాక్టర్లు, డ్రమ్ముల్లో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని వలన రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వెంటనే ట్రాన్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రేపల్లె, జూన్ 1 : నాటుసారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయటం జరిగిందని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. నగరం మండలంలోని జిల్లేపల్లి గ్రామంలో మురుగుకాల్వ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి శనివారం ధ్వంసం చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించేది లేదని, ఇతర రాష్ట్రాల మద్యాన్ని అమ్మితే చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

● జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి రాజునాయక్



ర్యాలీ నిర్వహిస్తున్న రాజునాయక్, బాలచంద్రమౌళి తదితరులు

తెనాలి, మారీసుపేట జూన్ 1 : పట్టణ ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి ధరావత్ రాజునాయక్ కోరారు. స్థానిక పద్మశాలిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మలేరియా ఫైలేరియా సిబ్బంది మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మలేరియా జిల్లా ఇన్‌చార్జి అధికారి ధరావత్ రాజునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మలేరియా రహిత సమాజం కోసం జూన్ మాసాన్ని మలేరియా వ్యతిరేక మాసోత్సవంగా పరిగణించి వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ వారంలో ఒకటి లేదా రెండు సార్లు నీటి నిల్వలను తొలిగించడం వలన దోమ సంతతి అభివృద్ధి చెందకుండా చూడవచ్చన్నారు. తెనాలి ఇన్‌చార్జి సహా య మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ ప్రజలు దోమ తెరలు వాడుకొనుట ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని తెలిపారు. అనంతరం పట్టణంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్‌లు దివి కిషోర్, బిబి జాన్, మోనిక కుమార్, హర్షవర్ధన్, దేవిక వాణి, మహిత, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షులు దాసరి మల్లేశ్వరావు, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల శివరామప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



శ్రీ సువర్చల హనుమత్కాల్యాణం జరుపుతున్న పండితులు

బాపట్ల, జూన్ 1 : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ఉన్న శ్రీపాందురంగాపురం స్వామి దేవాలయంలోని వీరాంజనేయస్వామికి శనివారం ఉదయం మూలమూర్తికి సిందూరార్చన, విశేష నాగవల్లి దళార్చన, చూతఫలార్చన పూజ అనంతరం అత్యంత వైభవంగా శ్రీ సువర్చల హనుమత్కాల్యాణం నిర్వహించారు. శ్రీలలిత త్రిపురసుందరి పీఠం నిర్వాహకులు నెమలి కంటి హనుమంతరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు మేడూరి వెంకటఅప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, కొల్లిపర వెంకటశివ వరప్రసాద్, పంగులూరి కౌండిన్య, గుడూరు సాయివెంకట్, విన్నకోట సురేష్, వక్కలగడ్డ బాలాజి, ఉమామహేశ్వరరావు, నీరజాదేవి పాల్గొని కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు.

కర్లపాలెం మండలంలో...



కర్లపాలెంలోని శ్రీపెద్దింటమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న చిత్రం

కర్లపాలెం, జూన్ 1 : మండలంలోని 20 పంచాయతీలలో శ్రీ ఆంజనేయస్వామికి, శ్రీప్రసన్నాంజనేయస్వామికి, శ్రీ అభయాంజనేయ స్వామికి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి వేలాది మంది భక్తులు శనివారం తమలపాకుల పూజ, నిమ్మకాయల దండలు, తులసీమాలలు, విశేష అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించారు. కర్లపాలెంలోని శ్రీపెద్దింటమ్మతల్లి దేవాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామివారికి, పాతనందాయపాలెంలోని శ్రీ అభయాంజనేయస్వామికి, చింతాయపాలెంలోని ఆంజనేయస్వామికి, పలు గ్రామాలలోని ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పాతనందాయపాలెంలో వందలా మంది భక్తులకు అన్నదానం చేశారు.

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, జూన్ 1 : మండలపరిధిలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని కప్పలవారిపాలెం గ్రామంలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీహనుమజ్జయంతి వేడుకలు నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పార్టీ శ్రేణులతో కలిసి అక్కడకు విచ్చేసి శ్రీఅభయాంజనేయస్వామికి పాలాభిషేకం, నెయ్యి అభిషేకాలు నిర్వహించారు. కోన రఘుపతి మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయస్వామివారి ఆశీస్సులు ప్రజలకు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయనిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఇన్‌చార్జి ఉప ఎంపీపీ సింధు కోటిరెడ్డి, ఖాజీపాలెం సొసైటీ అధ్యక్షుడు కూనంపూడి దేవేంద్రరాజు, ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్నరాజు, జీఎస్‌పాలెం సర్పంచ్ దబ్బుకూటి మాదవరావు, ఉప ఎంపీపీలు చేబ్రోలు కృపానందం, అల్లూరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ వాలి శివారెడ్డి, మంతెన సుబ్బరాజు, మంతెన రామచంద్రరాజు, పలువురు గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

● అలకాపురం గ్రామపంచాయతీలోని సత్యనారాయణపురం, జీఎస్‌పాలెం గ్రామపంచాయతీలోని మన్నెంవారిపాలెం గ్రామంలో, పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని కొత్తపేట గ్రామంలో, పురాతన ఆంజనేయస్వామి దేవస్థానాలకు చెందిన మంతెనవారిపాలెం, చందోలు, ఖాజీపాలెం తదితర గ్రామాలలో శ్రీహనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపల్లె నియోజకవర్గంలో...



రేపల్లె ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రేపల్లె, జూన్ 1 : తీరప్రాంతంలో హనుమత్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గంలో పలు ప్రధాన ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామివారికి ఉదయం విఘ్నేశ్వరస్వామి పూజ, పంచామృతాల అభిషేకం, తమలపాకుల పూజ, మల్లెపూల పూజ కార్యక్రమాలను



నగరం మండలంలో హనుమత్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నభక్తులు

ఆయా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణతో నిర్వహించారు. శనివారం రేపల్లె, నగరం, నిజాంపట్నం చెరుకుపల్లి మండలాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాలు, పట్టణంలోని ప్రసన్నాంజనేయస్వామి, పేటేరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమత్ జయంతి సందర్భంగా భక్తులు హనుమాన్‌చాలీసా, సుందరకాండ పారాయణ నిర్వహించారు. ఆంజనేయస్వామికి తమలపాకుల పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం అందించగా కొన్ని ప్రధాన దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పేటేరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో కార్యనిర్వహణాధికారి దివి వెంకటఅప్పాలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందించారు.

వేమూరు మండలంలో...



జంపని వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం

వేమూరు, జూన్ 1 : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం దీవి లక్ష్మీనరసింహాచార్యులు పర్యవేక్షణలో ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి 27 పవిత్ర దవ్యాలతో విశేషంగా అభిషేకం జరిపారు. స్వామిని పట్టు వస్త్రాలు వెండి ఆభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి స్వర్ణకమలాలతో అష్టోత్తర శతనామ పూజ నిర్వహించారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సువర్చలా సహిత వీరాంజనేయ స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం పక్షోకి ఉత్సవం అనంతరం స్వామివారికి అరటి పండ్లు, నిమ్మకాయలు, తమలపాకులు, వివిధ రకాల పవిత్ర పుష్పాలు, పవిత్ర పత్రాలతో విశేషంగా పూజించారు. 108 మంది భక్తుల చేత స్వామి వారి 1108 నామాలను పఠింపజేసి లక్ష నామ యజ్ఞక్రతువును నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ పరాన్కుశం ఆనందబాబు అర్చకులు చంద్రశేఖర్, శ్రీనివాసమూర్తిలు పంచసూక్తాలు మన్యుసూక్తాన్ని పఠించారు. మన్నె వెంకట సుబ్బారావు, తలశిల గంగాధరరావు, యార్లగడ్డ వరప్రసాద్, ముక్కామల వెంకటరమణ, పొట్టి శివన్నారాయణ, మేదరమెట్ల హరికృష్ణ, ముత్తినేని రవీంద్రబాబు, కమ్మెల వెంకటేశ్వరరావు, సునిశెట్టి సురేంద్ర, గాదంశెట్టి వెంకట బదరీ సూర్యనారాయణ దంపతులు ఉత్సవ కైంకర్యకర్తలుగా వ్యవహరించారు. పలు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.

కొల్లూరు మండలంలో...



క్రాప అడ్డరోడ్డు వద్ద విశేష పూజలు అందుకున్న అభయాంజనేయస్వామి

కొల్లూరు, జూన్ 1 : హనుమత్ జయంతి ఉత్సవాలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. శనివారం హనుమత్ జయంతి పురస్కరించుకుని కొల్లూరుతో పాటు మండల గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారికి మన్యుసూక్త పంచామృతాభిషేకం అనంతరం పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. క్రాప అడ్డరోడ్డు వద్ద ఇటీవల నూతనంగా ప్రారంభించిన అభ యాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు జరిపించి భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కొల్లూరు గౌడపాలెం ఆంజ నేయ స్వామి గుడి వద్ద అన్నసంతర్పణ జరిగింది. చిలుమూరు, ఈపూరు లంక, పోతార్లంక, చినపులివర్రు గ్రామాల్లో హనుమత్ జయంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కార్య నిర్వహణాధికారులు మంతెన అనుపమ, దీవి వెంకటప్పాలాచార్యులు పర్యవేక్షించారు. క్రాప అడ్డరోడ్డు వద్ద కొత్తపల్లి మధుసూదన రావు పూజాది కార్యక్రమాలు, అన్నసంతర్పణ పర్యవేక్షించారు.

అమృతలూరు మండలంలో...



ప్రత్యేక పూజల్లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి

అమృతలూరు, జూన్ 1 : మండల పరిధిలోని గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అమృతలూరులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వైఖానసాగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలతోపాటు వివిధ ఫలాలతో పంచామృత స్నపన, నాగవల్లీదళ సహస్రనామార్చన, లక్ష మల్లెలతో పూజలు జరిపారు. పూజలను పులిపాక వంశీయులు నిర్వహించారు. అర్చక స్వాములు పరాశరం రత్నమాచార్యులు, పవన్, సోమశేఖర్, మేడూరి యోగానంద్, కృష్ణమాచార్యులు, వేదాంతం లక్ష్మీనాథ్ పూజా కార్యక్రమాలు చేపట్టారు.



టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ డిజైనింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంసీఏ సభ్యులు

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకే శిక్షణా కార్యక్రమాలు

● మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సెక్రటరీ పరుచూరి

రేపల్లె, జూన్ 1 : వేసవి శెలవుల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అనేక కార్యక్రమాలపై ఎంసీఏ ద్వారా శిక్షణ ఇవ్వటం జరిగిందని మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సెక్రటరీ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంసీఏ హాలులో వేసవిలో విద్యార్థులకు మహిళలకు ఉపయోగపడే విధంగా ఎంసీఏ ఆధ్వర్యంలో కరాటే, తైక్వాండో, స్పోకెన్ ఇంగ్లీషు, షటిల్ బ్యాడ్మింటన్ కూచిపూడి నృత్యం, మహిళలకు ఎంబ్రాయిడింగ్, టైలరింగ్‌లో 40రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన వారికి శనివారం సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి శెలవుల్లో విద్యార్థినీ, విద్యార్థుల ఆసక్తిని బట్టి ఎంసీఏ ద్వారా ఏర్పాటు చేసిన తైక్వాండో, కరాటే, షటిల్ బ్యాడ్మింటన్, స్పోకెన్ ఇంగ్లీషు, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ పొంది వాటిల్లో రాణించారన్నారు. అదేవిధంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ఫ్యాషన్ డిజైన్‌లో ఎంబ్రాయిడింగ్, టైలరింగ్, జూట్‌బ్యాగ్‌ల తయారీలో మహిళలకు శిక్షణ ఇచ్చామని తద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటంతో పాటు ఆయా కుటుంబాలు తమ పిల్లలను చదివించుకోవటం, ఆర్థికంగా బలపడేందుకు దోహదపడుతుందన్నారు. ఎంసీఏ అధ్యక్షుడు కోగంటి రత్నాకరబాబు మాట్లాడుతూ ఎంసీఏ ద్వారా ప్రతి ఏడాది వేసవి శెలవుల్లో ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు, మహిళలకు దోహదపడే విధంగా కృషి చేస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంసీఏ సర్టిఫికెట్లను అందజేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏ జాయింట్ సెక్రటరీ నంబూరు సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు జీ.బాపారావు, నల్లూరు రమేష్, ఎంసీఏ సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మహిళలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నిబంధనలు పాటించాలి

● ఆర్వో వసంతరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో వసంతరాయుడు

వేమూరు, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్‌కు హాజరయ్యే రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలు తప్పని సరిగా పాటించాలని వేమూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు సూచించారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయం రోశయ్య మీటింగ్ హాల్లో కౌంటింగ్‌కు హాజరయ్యే రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటల కల్లా కౌంటింగ్ హాలుకు హాజరవ్వాలని ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని అన్నారు. సెల్‌ఫోన్ కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించబడదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ హాల్లో ప్రవర్తించాల్సిన విధానంపై పలు సూచనలు అందజేశారు. ఆయనతో పాటు డీఎస్పీ మురలీకృష్ణ, వేమూరు, చుండూరు సీఐలు రామకృష్ణ, శ్రీనివాసరావు, వేమూరు తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

వేమూరు, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలలో పని చేసే మధ్యాహ్న భోజన ఎండీఎం నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అందించాలని వేమూరు ఎంఈవో 2 రోజ్‌ల్యాండ్ సూచించారు. జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఎండీఎం నిర్వాహకులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాహకులు వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంఈవో 1 వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఆర్.వి.సుధారాణి, ఎండీఎం నిర్వాహకులు ఉన్నారు.

దేశంలో, రాష్ట్రంలో కూటమిదే అధికారం

● బీజేపీ నేత మంద జనార్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వేమూరు, జూన్ 1 : సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మందా జనార్ధన్ అన్నారు. వేమూరులో శనివారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ పదేళ్ళ కాలంలో దేశ ప్రజల సంక్షేమానికి దేశ అభివృద్ధికి చేసిన సేవలకు నిదర్శనంగా దేశ ప్రజలు ఎన్డీఏ కూటమికి మద్దతుగా నిలిచారని జనార్ధన్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో కూడా ఎన్డీఏ కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొంది కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని, వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా మాజీ మంత్రి, నక్కా ఆనందబాబు అధిక మెజార్టీతో గెలుపొందుతారని జనార్ధన్ ధీమా వ్యక్తం చేశారు. ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు వెలివల సాంబశివరావు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వ తోడ్పాటు

చుండూరు జూన్ 1 : దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం ఇతోధికంగా తోడ్పాటును అందిస్తుందని సమగ్ర శిక్ష జిల్లా కో ఆర్డినేటర్ మట్టి జ్యోత్స్న తెలిపారు. మండల గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. గ్రామాల్లో దివ్యాంగులైన పిల్లలను గుర్తించడం కోసం సర్వే చేపట్టడం జరిగిందన్నారు. ఈనెల 9 వరకు ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు. దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు, అవసరమైన వారికి ఆపరేషన్లు, పరికరాలు, సదరన్ సర్టిఫికెట్ ద్వారా పెన్షన్లు, అమ్మఒడి వైద్య సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 1 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించడం జరుగుతుందన్నారు. ఇలాంటి పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత ఓర్పుతో ఉండాలని, ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకుంటూ దివ్యాంగుల జీవితాలను మెరుగుపర్చడానికి కృషి జరపాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు వెయ్యి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకుమారి, ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



దివ్యాంగుల కుటుంబంతో జిల్లా కో ఆర్డినేటర్ జ్యోత్స్న

ప్రమాదభరితంగా పల్లెకోన వంతెన

● కుంగిపోతున్న అప్రోచ్ రోడ్డు



శిథిలావస్థకు చేరిన పల్లెకోన వంతెన

భట్టిప్రోలు, జూన్ 1 : ఈ వంతెనపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. వంతెన దిమ్మలు పగుళ్ళిచ్చి ప్రమాదభరితంగా మారి ఏళ్ళు గడిచిపోతున్నప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ పాలకులు నిర్మించిన సింగిల్ రహదారి వంతెన గత కొన్ని సంవత్సరాలుగా శిథిలాస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. ఏక్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని, ఎంత మంది ప్రాణాలను బలితీసుకుంటుందోనని వాహనచోదకులు, ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు. భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై రేపల్లె-గుంటూరు ప్రధాన రహదారి మార్గంలో పల్లెకోన వద్ద సుమారు 120 సంవత్సరాల చరిత్ర కలిగిన వంతెన శిథిలమై ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై నుంచి నిత్యం ఆర్టీసీ బస్సులు, భారీ లారీలు, టిప్పర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. రేపల్లె నుండి వయా పల్లెకోన, భట్టిప్రోలు మీదుగా తెనాలి, విజయవాడ, ఒంగోలు, చీరాల, బాపట్ల, పొన్నూరు, గుంటూరు వైపునకు ప్రయాణించాలంటే ఈ వంతెన ప్రధాన మార్గంగా ఉంది. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్డు సైతం రోజురోజుకు కుంగిపోతుందని భారీ వాహనాలు ప్రయాణించినప్పుడు వంతెనపై మరింతగా భారం పడి కుదుపులకు గురవుతుందని వాహనచోదకులు చెప్పారు. వంతెన కూలిపోతే మరో మార్గం లేదని, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవాల్సిందేనంటున్నారు స్థానిక ప్రజలు, పల్లెకోనకు చెందిన రైతాంగానికి వంతెనకు దిగువన పంట పొలాలు ఉన్నాయని నిత్యం పంట పొలాలకు వెళ్ళేందుకు పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా శిథిలావస్థకు చేరిన వంతెనలను నిర్మిస్తున్నప్పటికి ఎప్పటికప్పుడు పల్లెకోన వంతెన మాత్రం నిరాదరణకు గురవుతుందని పల్లెకోన గ్రామస్థులు తెలిపారు. శిథిలమైన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మిస్తారని ఆశగా ఎదురుచూస్తున్న వాహనచోదకులు, ప్రయాణీకులకు నిరాశే ఎదురౌతుంది. ప్రమాదం జరిగి ప్రజల ప్రాణాలు కోల్పోకముందే సంబంధిత అధికారులు దృష్టి సారించి నూతన వంతెన నిర్మాణం జరిగేలా కృషి చేయాలని ప్రయాణికులు, వాహనచోదకులు, గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.



పల్లెకోన బ్రిడ్జి వద్ద కుంగిపోతున్న అప్రోచ్ రోడ్డు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

- శింగరకొండకు పోటెత్తిన భక్తులు
- శ్రీరాం, ఆంజనేయుని నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు, అన్నదానాలు





ప్రదక్షిణ నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు, పూజారులు, భక్తులు

లక్ష తమలపాకుల పూజ అనంతరం ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



అభయాంజనేయునికి పూజలు చేస్తున్న కొండయ్య

అద్దంకి, జూన్ 1 : హనుమజ్జయంతిని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హనుమజ్జయంతి శనివారం రోజు రావడంతో శింగరకొండ కు భక్తులు పోటెత్తారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం ప్రారంభమైన హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. శనివారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, బిందెతీర్థం, గోపూజ నిర్వహించారు. అనంతరం నిత్యాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం పరివార దేవతలకు నారికేళ ఫల సమర్పణ చేశారు. ప్రసన్నాంజనేయస్వామి మూల విరాట్‌కు లక్ష నాగవల్లీ (లక్ష తమలపాకులు) దళార్చన నిర్వహించారు. యాగశాలలో నిత్య అనుష్టానములు, మన్యుసూక్త హవనము, పూర్ణాహుతి ద్రవ్య పూజ, మహా పూర్ణాహుతి, యాగశాల ప్రదక్షిణ జరిగింది. సాయంత్రం దీపాలంకరణ, ఊంజల్ సేవ నిర్వహించారు. సహస్ర చూతఫల (మామిడి పండ్లు) పూజ నిర్వహించారు. ఉభయదాతలు గా పాతూరి సీతాపతి దంపతులు, ధూళిపాళ్ల రామగోవిందు, శివకుమారి దంపతులు, వామరాజు ప్రసాదరావు, కల్యాణి దంపతులు, దేరంగుల వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన దీక్షా భక్తులు శనివారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించారు. ఆకు పూజలు, అర్చన, వాహన పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హనుమజ్జయంతికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో శింగరకొండ వద్ద తిరునాళ్లను తలపించే విధంగా ఉంది. 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలో ప్రభుత్వ వైద్యశాల వద్ద, వేలమూరిపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం ల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని తిమ్మాయపాలెంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంగులూరులో..

పంగులూరు : మండలంలోని చందలూరు, పంగులూరు గ్రామాలలో హనుజ్జయంతిని శనివారం భక్తితో నిర్వహించారు. చందలూరులోని శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు భారీ అన్నదాన ఏర్పాటు చేశారు. పంగులూరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవధూతేంద్ర భక్త సమాజం హనుమాన్ చాలీసా పఠనం చేశారు.

బల్లికురవలో..

బల్లికురవ : హనుమజ్జయంతిని భక్తులు భక్తితో నిర్వహించారు. కొత్తపాలెం, గుంటుపల్లి, నక్కబొక్కలపాడు, అంబడిపూడి, వైదన, కొప్పెరపాడు, మల్లాయపాలెం, కొణిదెన, చెన్నుపల్లి, కొండాయపాలెం, ముక్తేశ్వరం గ్రామాలలో ఉన్న అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, పొంగళ్లు సమర్పించారు. గ్రామాల్లో హనుమ ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తపాలెం, అంబడిపూడి. నక్కబొక్కలపాడు తదితర గ్రామాలలో అన్నదానాలు ఏర్పాటు చేశారు. జై శ్రీరాం అంటూ భజనలు చేస్తూ అలరించారు. కొన్ని గ్రామాలలో కోలాట ప్రదర్శనలు నిర్వహించారు.

ఆంజనేయునికి తమలపాకుల సేవ

చీరాల, జూన్ 1 : చీరాల నియోజకవర్గంలో శనివారం హనుజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో హనుమకు తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. చీరాల మండలం బుర్లవారిపాలెం, ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ సమీపంలో అభయ ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. పేరాల భద్రావతి సమేత భావనారుషి దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చీరాల బోసునగర్‌లో వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేటపాలెం స్ట్రయిట్‌కట్ సమీపంలోని అభయ ఆంజేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

చినగంజాంలో..

చినగంజాం : మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాయుపుత్రుని విగ్రహానికి నూతన వస్త్రాలు, పలు రకాల పూలలతో గజమాల వేసి విశేష పూజలు జరిపారు. అర్చకులు ముఖేష్‌పాండే ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి, వడమాల పూజలు జరిపారు. భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపి, స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్‌లో, గొనసపూడి, సంతరావూరు, పెదగంజాం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో అభయాంజనేయస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

పర్చూరులో..

పర్చూరు : హనుమజ్జయంతి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీ అభయాంజనేయస్వామివారికి ఆకు పూజలు నిర్వహించారు. వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన శ్రీ అభయాంజనేయస్వామి 92 అడుగుల విగ్రహం వద్ద పూజాకార్యక్రమాలు చేశారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలను భక్తితో నిర్వహించారు. కాల్వ సత్యనారాయణ నేతృత్వంలో గ్రామస్థుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. బోడవాడ గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామివారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దీంతోపాటు, అన్నంబొట్లవారిపాలెం, అడుసుమల్లి, నాగులపాలెం, నూతలపాడు, చెరుకూరు గ్రామాల్లో హనుమజ్జంతి వేడుకలు వైభవంగా చేశారు.



పర్చూరులో పూజలందుకున్న స్వామి

ఇంకొల్లులో..

ఇంకొల్లు : హనుమాన్ జయంతి సందర్భంగా ఇంకొల్లులో శ్రీహరిహర ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. పెద్దచెరువు తటాకాంజనేయ స్వామి దేవస్థానం నుంచి ప్రారంభమై వీరాంజనేయస్వామి సందర్శన, కృష్ణనగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి సందర్శన అనంతరం పర్చూరు రోడ్డు గుండా నాగులచెరువు రావిచెట్టు వద్ద ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వరకు యాత్ర కొనసాగింది. గంగవరంలో ఆంజనేయస్వామికి, పావులూరు పొలిమేర వీరాంజనేయస్వామి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గొయ్యిలో ఏర్పాటు చేసిన డ్రమ్ము

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదమరిస్తే అంతే..!

- ప్రమాదకరంగా గొయ్యి
- నివారణకు గొయ్యిలో డ్రమ్ము ఏర్పాటు



ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

అద్దంకి, జూన్ 1 : ఆర్టీసీ బస్టాండ్ వద్ద గొయ్యి ప్రమాకరంగా ఉంది. అవుట్ గేట్ నుంచి బయటకు వచ్చే చోట సైడ్ డ్రైన్‌కు పెద్ద గొయ్యి పడింది. గతంలో ఉన్న గొయ్యిని మట్టితో పూడ్చగా మరలా సమీపంలో మరో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ప్రమాదపు అంచున ప్ర యా ణం చేస్తున్నారు. పెద్ద గొయ్యి కావడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. దీంతో గొయ్యిలో డ్రమ్మును ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక ఏర్పాటు చేశారు. మధ్యలో డ్రమ్ము ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ బస్‌లు బయటకు రావడానికి ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టమాటా లారీ బోల్తా



జొన్నతాళి సెంటర్ సమీపంలో బోల్తాపడిన లారీ

మార్టూరు, జూన్ 1 : జాతీయ రహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో జొన్నతాళి సెంటరు సమీపంలో సూర్య దాబా ఎదురుగా టమాటా బాక్సులతో వెళుతున్న ఐషర్ లారీ బోల్తా పడిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్షేమంగా ఉన్నాడు. అందిన సమాచారం మేరకు కర్నాటక రాష్ట్రం రాయచోటి నుంచి విజయవాడకు ఐషర్ లారీలో టమాటా బాక్సులను తీసుకువెళుతున్నారు. అయితే లారీ డ్రైవర్ 1వ నంబరు లైన్‌లో వెళ్తుండగా పక్కనే వెళుతున్న మరో వాహనం మీదకు దూసుకురాగా లారీని అదుపుచేయలేక డివైడర్ పైకి ఎక్కించడంతో రోడ్డుపై లారీ బోల్తాపడినట్లు డ్రైవర్ చెప్తున్నారు. దాంతో లారీలో ఉన్న టమాటా బాక్సులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ విషయంపై సమాచారం అందడంతో హైవే మొబైల్ వాహనం సంఘటనా స్థలానికి చేరి ట్రాఫిక్‌కు అవరోధం లేకుండా చేశారు. అదేవిధంగా విజయవాడకు చెందిన వారు టమాటా బాక్సులు కోసం ప్రత్యేకంగా మూడు వాహనాలలో వచ్చి రోడ్డుపై ఉన్న ట మాటా బాక్సులు వారి వాహనాలలో తీసుకువెళ్లారు. హైవే మొబైల్ పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

చీరాలపై ప్రత్యేక నిఘా



చీరాలటౌన్, జూన్ 1 : కౌంటింగ్ సమయంలో చీరాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఎలక్షన్ నేపథ్యంలో శనివారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మంగళవారం రెండు కెమెరాల పర్యవేక్షణలో చీరాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. గతంలో వివాదాలకు పాల్పడిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కొంతమందిపై రౌడీషీట్‌లు నమోదు చేసినట్లు వివరించారు. ప్రశాంత కౌంటింగ్‌కు అన్ని పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఎస్పీ సీఐ మల్లికార్జునరావు, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్ తదితర స్టేషన్‌ల సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేయండి

ఇంకొల్లు, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతల దృష్ట్యా 3వ తేదీ సాయంత్రం, 4వ తేదీన పట్టణంలో అన్ని రకాల దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి సహకరించాలని ఎస్ఐ మల్లికార్జునరావు కోరారు. 4న మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, అల్లర్లు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

నేడు గుంటూరులో టీడీపీ ఏజెంట్లకు శిక్షణ

అద్దంకి, జూన్ 1 : పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టీడీపీ ఏజెంట్‌లకు ఆదివారం ఉదయం 11 గంటలకు గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో శిక్షణ జరుగుతుందని, అద్దంకి నియోజకవర్గంలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఏజెంట్‌లు హాజరు కావాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ 3 పరిధిలోని నర్సరావుపేట, గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, బాపట్ల పార్లమెంట్ ప రిధిలోని పోస్టల్ బ్యాలెట్ టీడీపీ ఏజెంట్లకు శిక్షణ జరుగుతుందని తెలిపారు.

కూటమితోనే బీసీ వర్గాల అభివృద్ధి

ఇంకొల్లు, జూన్ 1 : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంతో బీసీ వర్గాలవారి అభివృద్ధితోపాటు వారికి అగ్రస్థానం కల్పిస్తుందని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతనిధి గుంజి వెంకట్రావు అన్నారు. శనివారం ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అధ్యక్షతన మార్టూరు పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ బీసీ వర్గాల ప్రజలు ఏలూరి సాంబశివరావుకు పూర్తి మద్దతు తెలిపారని రానున్న ఎన్నికల ఫలితాల్లో 25 వేల అత్యధిక మెజార్టీతో ఏలూరి సాంబశివరావు 3వ సారి గెలవనున్నారని ధీమా వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కరి శ్రీనివాసరావు, బట్టు శ్రీనివాసరావు, తన్నీరు ఆంజనేయులు, వడ్లమూడి సాంబయ్య, గుంజి బాబు, రవి, వేణు, మోహనరావు, వెంకట్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10న సోపిరాలలో మండల స్థాయి పోలురాధ ఎడ్ల పందేలు

ఇంకొల్లు, జూన్ 1 : మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి నాటుబండి పోలురాధ ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో సోపిరాల గ్రామ పెద్దలు, ప్రజల సహాయ సహకారంతో ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు గ్రామ టైరుబండ్ల యూనియన్ అధ్యక్షుడు తుమ్మల పెంట జయరావు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.20,116, రెండవ బహుమతి రూ.18,116, మూడవ బహుమతిగా రూ.15,116, నాల్గో బహుమతిగా రూ.12,116, ఐదో బహుమతిగా రూ.10,116 అందజేయనున్నట్లు తెలిపారు. బండిని ఆరుగురు మాత్రమే తోలాలని, బండి మీద బరువు క్వింటా మాత్రమే ఉంటుందని, తోకలు విరువరాదు, కర్రతో కొట్టరాదని, తుది నిర్ణయం కమిటీ సభ్యులదేనని తెలిపారు. పూర్తి వివరాలకు 9133377719, 7337079054৪, 7675011316 సెల్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. పోటీలను తిలకించడానికి వచ్చే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన కొండయ్య

సేవా కార్యక్రమాలు అభినందనీయం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, జూన్ 1 : పది మందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు ఎవరు నిర్వహించినా వారు అభినందనీయులని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోహిణి కార్తె ఎండలు, వడగాలులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ సయమంలో దాహార్తిని తీర్చేందుకు, ఎండలకు సేదతీరేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొండయ్య అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి వైభవానికి అద్దం 'అద్దంకి కథలు'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ మిత్ర మండలి సభ్యులు

అద్దంకిటౌన్, జూన్1 : నాటికీ నేటికీ విరాజిల్లుతున్న పట్టణం అద్దంకి అని, అద్దంకి వైభవానికి గుండె చప్పుడు అద్దంకి కథలు అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం స్థానిక మారం వారి సేవా సదన్‌లో రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన అద్దంకి కథలు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆర్‌వీ రాఘవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఈ పుస్తకం విశేషాలను సభలో వివరించారు. ఈ సందర్భంగా రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులను మిత్రమండలి సభ్యులు, తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, ఆర్‌వి రాఘవరావు, వెంకటేశ్వరరావు, రఘురామశర్మ, దివాకర్‌దత్తు, చంద్రశేఖర్, ప్రతాప్, వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) పాల్గొన్నారు.

వైభవంగా బొబ్బేపల్లి తిరునాళ్ల



కల్యాణం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో శ్రీ సువర్చలా సహిత వీరాంజనేయస్వామి

మార్టూరు, జూన్ 1 : మండలపరిధిలో బొబ్బేపల్లి రాజుగారిపాలెం కొండపై శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం శ్రీసువర్చలాసహిత వీరాంజనేయస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీవీరాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు సందర్భంగా 37వ తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ శ్రీవీరాంజనేయస్వామి విగ్రహానికి తమలపాకులు, పూలు, వెండితొడుగులతో అందంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చినభక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి కల్యాణానికి దంపతుల ఉత్సవ విగ్రహాలను భక్తులు పల్లకిలో ఊరేగిస్తూ మూలవిరాట్ చుట్టూ ప్రదక్షిణాలు చేయించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కల్యాణానికి 20 మంది దంపతులపైగా పీటలపై కూర్చున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా కోలాటం ప్రదర్శించారు. తిరునాళ్లకు మార్టూరు, బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తుల తరలివచ్చారు. అదేవిధంగా మండలంలోని ద్రోణాదుల గ్రామంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు భారీగా అన్నదానం చేశారు. కార్యక్రమానికి గ్రామస్థులు విశేషంగా తరలి వచ్చారు. మార్టూరులో చెన్నకేశవుని దేవస్థానంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉదయాన్నే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఐనవోలు రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వలపర్ల గ్రామంలో హనుమ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్ర సాదాలను పంపిణీ చేశారు.

తిరుమలకు భజన మండళ్లు

ఉత్సవాల్లో పాలుపంచుకునేలా చేయడమే దాస సాహిత్య లక్ష్యం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అద్దంకి, జూన్ 1 : భజన మండళ్ల సభ్యులను పెద్ద సంఖ్యలో తిరుమలలో జరిగే ఉత్సవాలలో పాలుపంచుకునే విధంగా చేయడమే టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు లక్ష్యం అని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగ డాల ఆనందతీర్థాచార్యులు అన్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాలోని భజనమండళ్ళ సభ్యులకు శిక్షణ తరగతులు శనివారం శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ సభ్యులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలన్నారు. నేటి తరానికి, భవిష్యత్ తరాలకు జానపద కళల గురించి తెలియజేస్తూ హిందూ ధర్మ ప్రచారం చేయాలన్నారు. తమ భజన మండళ్లను రిజిస్టర్ చేసుకొని తిరుమలతో పాటు పలు ప్రాంతాలలో దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. భజన మండళ్ల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భజన మండళ్ల సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఆదివారం ఉదయం ఒంగోలులోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రకాశం జిల్లా భజనమండళ్లకు శిక్షణ కార్య క్రమం జరుగుతుందని ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు తెలిపారు.

గ్రామాల్లో 144 సెక్షన్

బల్లికురవ, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 4వ తేదీ మంగళవారం అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు సహకరించాలని ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుకాణాలను మంగళవారం మూసి వేయాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఫలితాలు వచ్చాక ర్యాలీలు నిర్వహించినా, బాణసంచా కాల్చినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే పార్టీల నేతలపై బైండోవర్ కేసులు ఉన్నాయని, కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చీరాలటౌన్, జూన్ 1 : పట్టాలు దాటుతూ రైలు ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని సుమారు 30 సంవత్సరములు కలిగిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కారంచేడు రైలు గేటు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు




చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

చీరాలటౌన్, జూన్ 1 : వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. అందిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం చీరాల ఆర్వో బీ వంతెనపై ఒంగోలుకు చెందిన కేశవ్ ద్విచక్ర వాహనంపై పర్చూరు వైపు వెళుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతనికి రక్త గాయాలయ్యాయి. పేరాల మసీదు సెంటర్‌లో కంభానికి చెందిన పవన్‌ను వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొవడి. ప్రమాదంలో ఎడమ కాలుకు తీవ్రంగా రక్త గాయమైంది. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అంతా బెట్టింగ్‌లే..!

- పట్టణం నుంచి గ్రామాల వరకూ నాయకులందరూ అదేదారి
- ఎవరిని కదిలించినా అదేమాట
- రాష్ట్రంలో అధికారం మొదలు .. అద్దంకిలో మెజార్టీ వరకు పందేలు
- ఎన్నికల ఫలితాల తరువాత ఓవర్గం మునగడం ఖాయం
- ఎవరు గెలిచినా... ఎవరు ఓడినా సగం మంది అప్పులపాలే



అద్దంకి, జూన్ 1 : బెట్టింగ్‌ల భూతం గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది. దీంతో గెలుపు, ఓటమిలు పక్కన పెడితే కౌంటింగ్ తరువాత సగం మంది బెట్టింగ్‌రాయుళ్ల నిండా ముసుకు వేసుకోవడం ఖాయమే అని చెప్పవచ్చు. ఇప్పుడు ఏ ఒక్కరిని కదిలించినా బెట్టింగ్‌ల గురించే ఆరా తీయడం కనిపిస్తోంది. గతంలో కొద్ది మంది మాత్రమే ఎన్నికల బెట్టింగ్‌లు పెట్టే వాళ్లు. ప్రస్తుతం ఎన్నికలను గ్రామస్థాయిలో కూడా అటు కూటమి నేతలు, వైసీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓటింగ్ చేయటం తో పాటు, అదే ఊపుతో బెట్టింగ్‌లకు కూడా దిగుతున్నారు. కౌంటింగ్ తేది దగ్గర పడే కొద్ది బెట్టింగ్ ల జోరు కూడా మరింత పెరుగుతుంది. ప్రధానంగా రాష్ట్రంలో అధికారం చేపట్టే పార్టీ, అద్దంకిలో టీడీపీ మెజార్టీ పై ఎక్కువ బెట్టింగ్ లు సాగుతున్నాయి. టీడీపీ మెజార్టీ 12 వేల నుంచి 15 వేల మధ్యననే ఎక్కువ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. అదే సమయంలో అన్ని మండలాలలో టీడీపీ మెజార్టీపై బె ట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తుంది. అద్దంకి నియోజవకర్గంలో గెలుపుపై మాత్రం అత్యల్పంగానే బెట్టింగ్ జరుగుతుండడంతో చూస్తుంటే వైసీపీ నేతలు అద్దంకి నియోజకవర్గంలో ఓటమిని పరోక్షంగా ఒప్పుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొద్దిమంది మా త్రం లక్షకు రెండు లక్షలు చొప్పున గెలుపుపై బెట్టింగ్ లు పెడుతున్నట్లు తెలుస్తుంది. గ్రామస్థాయి నేతలతో పాటు రైతులు కూడా బెట్టింగ్‌లలో ఉండడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది పంటలు సాగు చే యక ఖాళీగా ఉన్న రైతులు ఇప్పుడు బెట్టింగ్ లను ఎం చుకొని సంపాదించాలన్న ఆశతో దిగారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 4వ తేదీన కౌంటింగ్ ముగిసిన తరువాత బెట్టింగ్‌లు పెట్టిన వారిలో సగం మంది కచ్చితంగా తీవ్రంగా నష్టపోవడం ఖాయం. గత ఎన్నికలలో ప్రభుత్వంపై, అద్దంకి నియోజకవర్గంపై బె ట్టింగ్‌లు పెట్టి ఉండడంతో అక్కడ వైసీపీ, ఇక్కడ టీ డీపీ గెలవడంతో కొద్దిమంది మాత్రమే నష్టపోయారు. ఇప్పుడు వివిధ రకాలుగా బెట్టింగ్‌లు పెట్టి ఉండడంతో ఎవరు లాభ పొందుతారో, ఎంతమంది తీవ్రంగా నష్టపోతారో వేచి చూడాల్సి ఉంది. సొంత డబ్బులతో బె ట్టింగ్‌లు పెడుతున్న వారు తక్కువ కాగా, ఎక్కువ మంది వడ్డీలకు తెచ్చి మరీ బెట్టింగ్‌లు పెడుతుండడం తో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో కూడా బెట్టింగ్ పెట్టడంతో కౌంటింగ్ తరువాత పలు కుటుంబాలు అప్పులపాలు కావడంతోపాటు, వ్యక్తిగత కక్షలు కూడా పెరిగే అవకాశం ఉంది. అదే సమయం లో గ్రామాలలో ఘర్షణలకు కూడా దారి తీసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఫలితాల కోసం మంగళవారం వరకూ వేచిచూడాల్సిందే.